రేపటి నుంచి సమ్మక - సారక్క జాతర

బండ్లగూడ, ఫిబ్రవరి 10. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మానస హిల్స్లో సమ్మక్క సారక్క జాతరను బుధవారం నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు పూజారి చంద్రకుమార్ ముదిరాజ్ తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ జాతరకు భారీ ఎత్తున భక్తులు హాజరవుతారని ఆయన తెలిపారు. ప్రతి సంవత్సరం నిర్వహించే సమ్మక సారక్క జాతరను ఈ సంవత్సరం కూడా భారీ స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాజేంద్రనగర్ పరిసర ప్రాంతాల్లో ప్రజలందరూ సమ్మక-సారక్క జాతరలో పాల్గొనాలన్ని ఆయన విజ్ఞప్తి చేశారు.

మారణ హోమాన్ని ఆపేయండి

హిమాయత్ నగర్, ఫిబ్రవరి10: కార్పొరేట్ శక్తులకు ఆదివాసీల ఖనిజ సంపదను కట్టబెట్టేందుకే మావోయిస్టులను కేంద్రం అంతం చేస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీఎస్ బోస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజంలో సామాజిక, ఆర్థిక,రాజకీయ రంగాల్లో మార్పు రాకుండా మావోయిస్టు భావజాలాన్ని లేకుండా చేయడం అసాధ్యమన్నారు. ఆదివాసి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని ఆరోపించారు. దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగం, ఆకలి చావులు, పేదల సమస్యలను పరిష్కారం చేయకుండా ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు, దాడులు చేయడం ప్రభుత్వాలకు పరిపాటిగా మారిందని మండిపడ్డారు. సుప్రీంకోర్టు ఈ విషయంలో జోక్యం చేసుకుని దండ కారణ్య ప్రాంతాల్లో జరిగే మారణ హోమాన్ని ఆపివేసి సైనిక బలగాలను అక్కడి నుంచి ఉపసంహ రించుకునేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు.

నిరంతరాయంగా అభివృద్ధి పనులు

సికింద్రాబాద్, ఫిబ్రవరి10: పదేండ్ల కాలంలో సికింద్రాబాద్ నియోజకవర్గంలో తాము ప్రారంభించి చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను నిరాటంకంగా కొనసాగిస్తామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ళ పద్మారావుగౌడ్ అన్నారు. అందుకు ఎన్ని కష్టాలైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని పేర్కొన్నారు. సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని భవానీనగర్‌లో దాదాపు రూ.20 లక్షల ఖర్చుతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు.

రైతులకు అండగా బీఆర్ఎస్

కొడంగల్ సభకు తరలివెళ్లిన మణికొండ బీఆర్ఎస్ నాయకులు

మణికొండ మున్సిపాలిటీ నుంచి కొడంగల్ రైతు దీక్షకు వెళ్తున్న గులాబీ పార్టీ నేతలు

మణికొండ ఫిబ్రవరి 10 : భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కొడంగల్‌లో జరిగిన రైతు దీక్షకు మద్దతుగా హాజరవుతున్న సందర్భంగా మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, రాష్ట్ర యువ నాయకులు కార్తీక్ రెడ్డి పిలుపు మేరకు మణికొండ భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ ఆధ్వర్యంలో సోమవారం పెద్ద ఎత్తున బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ స్కూల్ దగ్గర నుంచి బయలుదేరి, అప్పా జంక్షన్ వద్ద కేటీఆర్‌కు స్వాగతం పలికారు. అక్కడ నుంచి కొడంగల్‌కు మణికొండ మున్సిపాలిటీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బొమ్మ ఉపేంద్ర నాథ్‌రెడ్డి, గుట్టమీది నరేందర్, ముత్తంగి లక్ష్మయ్య, అందె లక్ష్మణ్ రావు, గోరుకంటి విఠల్, బండమీద మల్లేష్, ఉపేంద్రనాథ్ రెడ్డి, సంగం శ్రీకాంత్, యాలాల కిరణ్, మాల్యాద్రి నాయుడు, బుద్దోల్ బాబు, బాబు, సుమన్, భాను చందర్, దిలీఫ్, ఆరీఫ్ మొహమ్మద్, సుమనళిని, మోనిష్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఘన స్వాగతం

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సోమవాం కొడంగల్ పర్యటనలో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి వెళ్లారు. విషయం తెలుసుకున్న బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావులకోళ్ల నాగరాజు పార్టీ శ్రేణులతో కలిసి పోలీస్ అకాడమీ కూడలి వద్ద కేటీఆర్ కు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాముడు యాదవ్,రవీందర్ రెడ్డి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. – బండ్లగూడ

అనుమతి లేని సైరన్లు, బ్లాక్ ఫిల్మ్ తొలగింపు

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి10: పరిమితికి మించిన హారన్‌లు మోగిస్తూ ప్రమాదాలకు కారణం కావద్దని.. ఆయా వాహనాలకు అనుమతి లేని సైరన్‌లను వెంటనే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ఎస్ ఆర్ నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి. సైదులు హెచ్చరించారు. సోమవారం యూసుఫ్ గూడా చెక్ పోస్ట్ వద్ద వాహనాలకు బ్లాక్ ఫిల్మ్, సైరన్‌ల తొలగింపుపై ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆదివారం రాత్రి నిర్వహించిన తనిఖీలలో పాదచారులు, వాహన దారులకు, ఇబ్బందులు కలిగించేలా సైరన్‌లు మోగిస్తున్న 70 ప్రైవేట్ బస్సులు, లారీలు, ఇతర రవాణా వాహనాల హారన్లు జప్తు చేసి చలాన్లు విధించినట్లు తెలిపారు. నార్త్ అండ్ వెస్ట్ జోన్లలో ట్రాఫిక్-1 డీసీపీ రాహుల్ హెగ్డే ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ తనిఖీలలో నగరంలో నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. యూసుఫ్‌గూడా చెక్ పోస్ట్, కోట్ల విజయ భాస్కరరెడ్డి స్టేడియం ప్రాంతాల్లో జూబ్లీహిల్స్, ఎస్ ఆర్ నగర్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

యూసుఫ్‌గూడా చెక్ పోస్ట్ వద్ద వాహనాలకు అనుమతి లేని సైరన్లను తొలగిస్తున్న ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు

వీధిలైట్ల నిర్వహణపై దృష్టిసారించాలి

అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 10: వీధి లైట్ల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా అధికారులు,సిబ్బంది సమన్వయంతో పని చేయాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సోమవారం కాటేదాన్‌లోని తన కార్యాలయంలో స్ట్రీట్ లైట్స్ మెయిటెనెన్స్ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో చాలా సమస్యలు ఉన్నాయని అవి మెయిటెనెన్స్ కూడా చాలా తగ్గిపోయింన్నారు. వీలైనంత త్వరగా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనేక ప్రాంతాల్లో స్ట్రీట్ లైట్స్ పని చేయకపోవడంతో రాత్రి సమయంలో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటనే బిక్కుబిక్కుమంటూ భయపడుతున్నారన్నారు. వీలైనంత త్వరగా వీధి లైట్లకు మరమ్మతులు చేయాలన్ని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈ రామారావు, సురేందర్, మహేందర్‌రెడ్డి, శ్రీకాంత్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అశోక లివియాకు తాగునీరు సరఫరా

అశోక లివియానా అపార్ట్‌మెంట్ వాసులకు తాగునీటిని విడుదల చేస్తున్న జలమండలి శాఖ జనరల్ మేనేజర్ మహేందర్ నాయక్ తదితరులు

మణికొండ ఫిబ్రవరి 10: మణికొండ మున్సిపాలిటీ 19వ వార్డు పరిధిలోని అశోక లివియానా అపార్ట్‌మెంట్ వాసుల చిరకాల కోరిక ఎట్టకేలకు తీరింది. కొన్ని రోజులుగా బల్క్ తాగునీటి కనెక్షన్ ఇవ్వాలని జలమండలి శాఖ అధికారులను కోరగా ఎట్టకేలకు అధికారులు సోమవారం నీటి కనెక్షన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మణికొండ జలమండలి జనరల్ మేనేజర్ మహేందర్ నాయక్, మణికొండ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్, మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ సమక్షంలో జలమండలి సిబ్బంది అశోక లివియానా అపార్‌మెంట్ వాసులకు పైపులైన్ల ద్వారా తాగునీటి బల్క్ కనెక్షన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా అపార్‌మెంట్ వాసులు జలమండలి అధికారులకు, మాజీ ప్రజాప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై తమ అపార్‌మెంట్ వాసులకు తాగునీటి కష్టాలు తీరినట్టేనని అధ్యక్షుడు రజనీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, రఘు, శ్రీలత,శశికళ పాల్గొన్నారు.

అత్తాపూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

అత్తాపూర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 10: ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపిస్తున్నట్లు అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ అన్నారు. అత్తాపూర్ డివిజన్‌లోని పోచమ్మ దేవాలయం నుంచి హనుమాన్ దేవాలయం వరకు సీసీ రోడ్డు అభివృద్ధి పనులను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.19.80 లక్షల వ్యయంతో ఈ సీసీ రోడ్డు పనులను నిర్వహిస్తున్నామన్నారు. జీహెచ్ఎంసీలో కాంట్రాక్టర్లకు నిధులు రాక పనులు ఆలస్యమయ్యాయన్నారు. అధికారులతో చర్చించి పెండింగ్‌లో ఉన్న పనులు త్వరిగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని పనుల్లో నాణ్యతా లోపం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.కొమురయ్య, స్టార్ చిన్న, సరితారెడ్డి, డి.సునీత, ఏఈ రాజేష్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రాజు, బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

సీఎంఆర్ఎఫ్ పేద, మధ్య తరగతి ప్రజలకు వరంగా మారిందని రహ్మత్ నగర్ కార్పొరేటర్ సీ ఎన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కార్పొరేటర్ కార్యాలయం డివిజన్‌లోని కార్మిక నగర్ కు చెందిన సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారుడు వనికర్ శివ కు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.42 వేల చెక్కును అందజేశారు.

– జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 10

బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలి

శివరాంపల్లిలో ఓ ఇంట్లో టీబీ వ్యాధిపై సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బండ్లగూడ, ఫిబ్రవరి 10: ఇకనుంచి ప్రజలందరూ బీసీజీ వ్యాక్సిన్ తీసుకోవాల్సిందని ప్రభుత్వ అధికారులు వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ శివరాంపల్లి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వారి ఆధ్వర్యంలో టీబీపై ప్రత్యేక సర్వేలు నిర్వహించారు. సాధారణంగా టీబీ రాకుండా చిన్నారులకు బీసీజీ వ్యాక్సినేషన్లు వేస్తారు. కాగా ఇటీవల కాలంలో టీబీ వ్యాధి పెరుగుతుండడంతో 60 ఏళ్లు దాటిన వారికి తప్పనిసరిగా బీసీజీ వ్యాక్సినేషన్ వేయించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఈ సర్వే కార్యక్రమంలో వైద్య సిబ్బంది భాగ్యలక్ష్మి, శిల్ప, జ్యోతి, లక్ష్మి, ఆశ వర్కర్లు చెన్నమ్మ, సారధి, అంబికా తదితరులు పాల్గొన్నారు.

మహిళకు ఆర్థికసాయం అందజేత

మహిళలకు వైద్య సహాయం అందజేస్తున్న మణికొండ రెడ్డి ఫౌండేషన్ సభ్యులు

మణికొండ ఫిబ్రవరి 10: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో బస్సులో ప్రయాణిస్తూ, స్పీడ్ బ్రేకర్ మూలంగా ప్రమాదంలో సుజాత(43), అనే నిరుపేద మహిళ తీవ్రంగా గాయపడి వెన్నుముక విరిగడంతో, బస్సులోనే పడిపోయింది. ఆమెను చికిత్స నిమిత్తం దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తరలించారు. తన రోజు వారి వేతనంతో ఆసుపత్రి ఖర్చులు భరించలేని పరిస్థితిలో ఉందని మణికొండ ప్రాథమిక స్కూల్ హెడ్ మాస్టర్ ద్వారా తెలుసుకున్న మణికొండ రెడ్డి ఫౌండేషన్ సభ్యులు కొంత మంది మానవతా భావంతో ముందుకు వచ్చి, రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కొండకల రామకృష్ణారెడ్డి,కూచికుల్ల నరేందర్ రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి,శ్రీపతి రెడ్డి, రామసుబ్బారెడ్డి, శరత్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, శ్యామ్ రెడ్డి, సుభాశ్ రెడ్డి, కృపాకర్ రెడ్డి, పి. సైది రెడ్డి, కె. రామిరెడ్డి, గణేష్‌రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, జి.రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

బేగంపేట్ ఏసీపీ గోపాలకృష్ణ

బేగంపేట్, ఫిబ్రవరి 10: బేగంపేటలో రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన కృషి చేస్తున్నామని బేగంపేట్ ఏసీపీ గోపాలకృష్ణ తెలిపారు. సోమవారం బేగంపేట రసూల్‌పూరా జంక్షన్ వద్ద తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదల ఘటనా స్థలాన్ని బేగంపేట ఇన్స్పెక్టర్ రామయ్య, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పాపయ్య లతో కలిసి ప్రమాద ఘటనా స్థలాలను పరిశీలించారు. ప్రమాదాలు జరిగే స్థలంలో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేసి సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా లేక మెట్రో పిల్లర్ దగ్గర ఫుట్‌ఓవర్ బ్రిడ్జి అయినా నిర్మించాలి అనే విషయాలను పరిశీలిస్తున్నామని ఏసీపీ గోపాలకృష్ణ తెలిపారు త్వరలోనే ఈ సమస్యలకు పరిష్కారం చూపనున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ మధుసూదన్ రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కారు నడుపుతూ ..

బంజారాహిల్స్,ఫిబ్రవరి 10: మద్యం మత్తులో కారు నడిపిస్తూ ఫుట్‌పాత్ పైకి ఎక్కిన ఘటనలో నిందితుడిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే..నాంపల్లికి చెందిన కాజిల్ మాలిక్(26) అనే యువకుడు ఆదివారం తెల్లవారుజామున బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1లోని హయత్ ప్యాలెస్ హోటల్ మీదుగా పంజాగుట్ట వైపునకు తన బెలానో కారులో ప్రయాణిస్తున్నాడు. పీకలదాకా మద్యం సేవించిన మాలిక్ అతివేగంగా కారు నడిపిస్తూ అదుపుతప్పడంతో కారు ఫుట్‌పాత్ మీదకు ఎక్కింది. ఘటనపై సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు అక్కడకు వచ్చి కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో ఫుట్‌పాత్ మీద ఎవరూ లేకపోవడంతో ముప్పు తప్పింది. కాగా మాలిక్‌కు బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించగా మోతాదుకు మించి మద్యం సేవించినట్లు తేలింది. ఈమేరకు అతడిపై ర్యాష్ డ్రైవింగ్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆ మార్గాల్లో బస్సులు నడపండి

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 10: బోరబండ బస్ టెర్మినల్‌కు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో ఆర్టీసీ బస్సుల తిరుగుతుంటాయి. అయితే.. మియాపూర్, జీడిమెట్ల ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది. కానీ ఆ రెండు మార్గాలకు వెళ్లటానికి బోరబండ నుంచి బస్సు సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నారు. 2-3 బస్సులను మార్చాలి వస్తున్నది. జీడిమెట్ల, మియాపూర్ మార్గాల్లో వెళ్లటానికి డైరెక్ట్ బస్సు సౌకర్యాన్ని కల్పించాలని.. రద్దు అయిన 45ఎఫ్ రూట్ బస్సులను పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 10: పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కనాయకుడు, కార్యకర్త కృషి చేయాలని చేయాలని రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్ అన్నారు.

రాంనగర్ లో డివిజన్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారంచేయాలన్నారు. ఈ సందర్భంగా పార్టీ అందించిన క్యాలెండర్, డైరీలను నాయకులు, కార్యకర్తలకు అందజేశారు.

భారతీయ హక్కులను కాపాడటంలో కేంద్రం విఫలం

భారతీయులకు ట్రంప్ క్షమాపణ చెప్పాలి

హిమాయత్ నగర్‌లోని వై జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న ఏఐవైఎఫ్ నేతలు

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి10: దేశ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసే విధంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యవహరిస్తున్నారని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలివుల్లా ఖాద్రీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర విమర్శించారు. ట్రంప్ భారతీయులపై వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ సోమవారం హిమాయత్ నగర్ లోని వై జంక్షన్‌లో ట్రంప్ ఫ్లెక్సీని దహనం చేసి, చేతులకు సంకెళ్లు వేసుకుని వినూత్న పద్ధతిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రంప్ నిర్ణయాల వల్ల భారతీయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, భారత పౌరుల హక్కులను కాపాడటంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. 104 మంది భారతీయ పౌరులను అమెరికా నుంచి బహిష్కరించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా ముందు లొంగిపోయారని విమర్శించారు. గౌరవంగా పంపించకుండా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతీయులను అవమానించడం సరైన విధానం కాదన్నారు. పెట్టుబడిదారీ రాజ్యానికి దేశ ప్రతిష్టతను మోదీ తాకట్టు పెట్టడం సిగ్గుచేటు కరమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్. శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమాన్, నగర కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ మహమూద్, ఉపాధ్యక్షుడు మాజీద్ అలీ ఖాన్, నేతలు కల్యాణ్, అనిల్ కుమార్, మధు, సంజయ్‌కుమార్, సుమన్, గణేష్,భానుప్రకాశ్, స్వామి, వేణు, రమేష్,శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యతను పెంపొందించుకోవాలి

శంషాబాద్(రాజేంద్రనగర్) డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. హిమబిందు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఎం. హిమబిందు తదితరులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 10 : విద్యార్థులు నైపుణ్యతను పెంపొందించుకోవడానికి శిక్షణ కార్యక్రమాలు అవసరమని శంషాబాద్(రాజేంద్రనగర్) ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. హిమబిందు తెలిపారు. సోమవారం శంషాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కృత్రిమ మేధస్సుపై 10 రోజుల పాటు ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యతను పెంపొందించుకోవడానికి శిక్షణ కార్యక్రమాలు ఎంతో అవసరమని వివరించారు. మహిళా సాధికారత సెల్ అనే అంశంపై ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లెర్నింగ్ లింక్ ఫౌండేషన్ సహకారంతో విద్యార్థుల కోసం శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజాభివృద్ధిపై అవగాహన అవసరమని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్‌డీ భవానీ, భానుప్రకాశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీల అమలులో..

కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచర్ల శ్రీనివాస్

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 10 : రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచర్ల శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడంకోసం అనేక హామీలు ఇచ్చిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఒక్కహామీని అమలు చేయకుండా రైతులను నిండా ముంచుతున్నారని విమర్శించారు.

ఎన్నికల సమయంలో రైతు భరోసా ఏడాదికి రూ.15వేలు ఇస్తామని ఆశపెట్టిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఏడాదికి రూ.12వేలు మాత్రమే ఇస్తామని చెప్పి మాటతప్పారని విమర్శించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సంక్షేమ పథకాలను అమలు చేస్తామని గ్రామసభలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఒక పథకం కూడా అమలు చేయలేదన్నారు. గ్రామసభలలో ప్రజల నుంచి వచ్చిన వ్యతిరేకతతోనైనా అమలు చేయాల్సిన ప్రభుత్వం వాటిని పట్టించుకోవడంలేదన్నారు. రైతు భరోసా పథకంలో భాగంగా మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసింది. కనీసం ఆ గ్రామంలోనైన 10శాతం రైతులకు మాత్రమే భరోసా వచ్చిందని పేర్కొన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించిన కాంగ్రెస్‌కు రైతులు,ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికలలో గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

పరిశోధన నైపుణ్యాల ఉచిత శిబిరం ప్రారంభం

సికింద్రాబాద్, ఫిబ్రవరి 10: ఓయూ హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో ఓర్పు అన్‌లాకింగ్ రీసెర్చ్ స్కిల్స్ హ్యాండ్స్-ఆన్ వర్క్‌షాప్ పేరుతో ఉచితంగా నాలుగు రోజుల పరిశోధనా నైపుణ్యాల కార్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణా కార్యక్రమం ఫిబ్రవరి 10 నుంచి 13 వరకు హెచ్‌సీడీసీ కార్యాలయం, సీఎఫ్ఆర్‌డీ భవనం, ఉస్మానియా విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని ఈ-క్లాస్‌రూంలో నిర్వహించబడుతోంది. ప్రారంభ కార్యక్రమంలో హెచ్‌సీడీసీ డైరెక్టర్ ప్రొఫెసర్. సి.వి. రంజని, హెచ్‌సీడీసీ కోఆర్డినేటర్ డా పి మురళీధర్ రెడ్డి, ముఖ్య వక్త ఆర్ రమేష్, ఉస్మానియా విశ్వ విద్యాలయానికి చెందిన వివిధ కళాశాలల పీహెచ్‌డీ పరిశోధకులు పాల్గొన్నారు. సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషియల్ స్టడీస్ లో పనిచేస్తున్న రమేస్ అన్నెమల్లా, ఆర్థిక అభివృద్ధి, బ్యాంకింగ్, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలపై పరిశోధన చేస్తున్న ప్రముఖ నిపుణులు ఈ నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌డీ. పరిశోధకుల పరిశోధనా నైపుణ్యాలను పెంపొందించి, విశ్లేషణాత్మక సామర్థ్యాలను మెరుగుపరిచేలా రూపొందించనున్నట్లు తెలిపారు.

ఏటీఎంలో చోరీకి యత్నించిన వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్.ఫిబ్రవరి 10: ఏటీఎం సెంటర్‌లలోప్రవేశించి చోరీకి యత్నించిన ఘటనలో నిందితుడిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీకృష్ణానగర్‌లోని కెనరా బ్యాంక్ ఏటీఎంలో ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి ప్రవేశించి యంత్రాన్ని ధ్వంసం చేశాడు. అయితే లాకర్‌ను పగలగొట్టడం వీలుకాకపోవడంతో అక్కడినుంచి వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని గుర్తించిన సంస్థ ప్రతినిధులు రాత్రి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీతో పాటు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు నమోదు

ఆన్‌లైన్ యాప్ ద్వారా క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని శ్రీరాంనగర్‌లో నివాసం ఉంటున్న మహ్మద్ సాబేర్ (30) అనే వ్యక్తి కొంతకాలంగా గోల్డ్365 డాట్ కామ్ పేరుతో ఉన్న ఆన్‌లైన్ యాప్ ద్వారా క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. భారత్ - ఇంగ్లండ్ మధ్య జరిగిన మ్యాచ్ మీద బెట్టింగ్‌కు పాల్పడుతున్న సాబేర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు అతడిపై గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

బంజారాహిల్స్,ఫిబ్రవరి 10: పరీక్షలు సరిగా రాయలేకపోతున్నాని మనస్థాపానికి గురైన ఇంటర్మీడియట్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఫిలింనగర్ సమీపంలోని బీజేఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్న విజయ్‌కుమార్(17) రాయదుర్గం ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఏడాదిన్నర క్రితం తండ్రి మరణంతో తల్లి సైదమ్మతో కలిసి ఉంటున్నాడు. కాగా తండ్రి మరణంతో పాటు పరీక్షలు సరిగా రాయలేకపోతున్నానని, ఇటీవల ప్రాక్టికల్ పరీక్షలు కూడా బాగారాయలేదని మనస్థాపానికి గురైన విజయ్‌కుమార్ ఆదివారం రాత్రి తన గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు తల్లి సైదమ్మ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.